Y. RAMAKRISHNA
...లయం
చుక్కలూ...గీతలూ—
5716
శ్రీకాకుళం



# చుక్కలూ....గీతలూ---

ఆధునిక సారస్వతంలో చుక్కలకూ, గీతలకూ వున్నంత గిరాకీ మరి దేనికీలేదు. కలంపట్టి వ్రాయసాగిన ప్రతి ఆసామికీ చరమావధీ, పరమావధీ చుక్కలూ...గీతలూ---

ఎంత ఎక్కువగా తన రచనలో చుక్కలూ, గీతలూ యిరికిస్తే, ఇరికించగల్గితే అంత ---

చుక్కలలోనూ, గీతలలోనూ ఎంతో పరమార్థం వుంది. ఒక చుక్క ఒక కేంద్రాన్ని, ఒక గమ్యస్థానాన్ని, సూచిస్తుంది. ఇలాంటివి అనేకం చేరితే సువిశాల గగనవీథే, తారాపథమే, అనంతాకాశమేనని చెప్పవచ్చును!

చుక్క అతి చిన్నదిగానే కనిపించవచ్చును. అది మినుకుమినుకుమని పోయేదే కావచ్చును. కాని, అది శాశ్వతమైన ఒక మహత్తర భావానికి నిలయమనీ, సృష్టి స్థితిలయాలూ, కాలావకాశాలూ మొదలైన మానవాతీతమైన విషయాలకు అది ఫీజుకోరని సాక్షి అనీ మనకు తెలుసును. ఇటువంటివి అనేక చుక్కలైతే... ఇక కావలసిన దేముందీ?

ఇంక గీతలు ---

గీతలంటే తెలియని వారెవరూ? వీటి ప్రయోజనం ఎరగనివారెవరూ? కొన్ని అణువులు జేరి బ్రహ్మాండమైనట్టుగా, కొన్ని చుక్కలు... ఇలాంటివి జేరితే కొన్ని గీతలు --- ఇలాంటివి అవుతాయి!

చూశారా? చుక్కలకన్నా గొప్పవన్నమాట ఈగీతలు — ఈ గీతతే ఏమిటి, ఏ గీతలైనా సరే ---

గీయండి. మీకు తోచినన్ని గీతలు గీయండి. గీతలతో మన శత్రువును మనం ఓడించవచ్చును. నిలువుగా గీయండి, అడ్డుగా గీయండి, ఏటవాలుగా గీయండి, తలక్రిందులుగా గీయండి, అపసవ్యంగా గీయండి, ఎలా గీయండి. గీయడం ప్రధానం, ఎన్ని వంకరటింకర, కొంకిర బింకిర గీతలైనా సరే. గీతలలో మహత్తర భావముంది, విజ్ఞానముంది, గణితముంది లోకమే గీతలమయం!

చుక్కలూ, గీతలూ లేని ప్రపంచం చుక్కలూ, గీతలూ లేనట్టుగానే వుంటుంది......ఇలాగ బోడిగా!

ఆధునిక రచయిత చుక్కలనూ, గీతలనూ బాగా అర్థం చేసుకున్నాడు. యుగయుగాల తరబడిగా వస్తూంటే చుక్కల అనుభవమూ, గీతల అనుభవమూ ఆధునిక రచయితలో మున్మూర్తులా మూర్తీభవించి, పరిపూర్ణత్వాన్ని పొందేయి. ఆధునిక రచయిత చుక్కలనూ, గీతలనూ తన పాత్రలపై ప్రయోగిస్తాడు—

యువతి అంటుంది—"చంద్రుడెంత బావున్నాడు!" అని.

యువకుడంటాడు:—"నీముఖంకన్నా బావుండాటా చంద్రుడు?" అని.

యువతి:—"ఏమో నాకెలా తెలుస్తుంది?"

యువకుడు:—నీకు తెలియకపోతే నాకు తెలియదా ఏమిటి నీముఖం సంగతీ! ఏదీ వొక్కతియ్యటి..."

ఇక్కడ చుక్కలు పెట్టేస్తాడు రచయిత.

ఇవాళ్ళ కథలోని పాత్రలు రెండు మాట్లాడుకుంటాయి. సంభాషణ పూర్తిఅయినాక రెండు చుక్కలో, రెండు గీతలో వేసి పదిహేను సంవత్సరాలు దాటిపోయినట్టుగా సూచించవచ్చును. కాలావకాశాల కుప్పిగంతును మించినగంతు!

* * *

నవలలో ఒకచోట "అంతట పిస్తోలు ధామ్మనెను" అని వ్రాసి రెండు చుక్కలో, రెండు గీతలో వేస్తే ఆత్మహత్యో, ఖూనీయో ఏదో వొకటి ఆ సందర్భంలో జరిగిపోయిందన్న మాట!

* * *

ఇంక ఒక పాత్ర ప్రపంచాన్ని విడిచే సందర్భంలో—'అతడు అందరికేసీ మరొక్కసారి చూశాడు' అని చుక్కలుపెడితే—

ఆ చుక్కలు పూర్తి అయినచోట అంతా గొల్లుమన్నారు అని వేరే చెప్పనక్కర్లేదు! చెప్పాలంటే ఈ ప్రయోగవిధానాలు ఇంకా ఎన్నేనా వున్నాయి. వీటినిగురించి ఎంతైనా వ్రాయవచ్చును. కాని...